యజ్ఞోపవీతం ఎందుకు?

మనం మూడు ఋణాలతో పుట్టాము!!

జాయమానో హి వై పురుషః త్రీణ్ ఋణవాన్ అభిజాయతే ।
ఋణాని త్రీణి అపాకృత్య మనో మోక్షే నివేశయేత్ ॥ – ఉపనిషత్ సంగ్రహం

పురుషుడు (మనుష్యుడు) మూడు ఋణాలతో పుడతాడు. ఆ మూడు ఋణాలను తీర్చుకున్నవాడే విశుద్ధమైన మనస్సును పొంది మోక్షమును పొందుటకు అర్హుడౌతాడు. అవే – పితృ, దేవ, ఋషి ఋణాలు.

పై ఋషివాక్కులు మనకు వింతగా అనిపించవచ్చును – కానీ యివి పూర్తిగా సత్యం. సామాన్యంగా ఋణం అంటే అప్పు. ఏదైనా క్లిష్ట పరిస్థితి ఏర్పడినప్పుడు ఉన్నవారినుండి కొంత అప్పుగా తీసుకుంటాము. క్రమంగా దానిని తీర్చివేస్తూ ఉంటాము. ఆ అప్పు ధనరూపంలోనే ఉండాలనిలేదు అది వస్తువు కావచ్చు, సేవలు కావచ్చు, మాట సాయం కావచ్చు, శరణాగతి కావచ్చు, మరేదైనా కావచ్చు. సామాజిక జీవనంలో ఇవన్నీ సామాన్యమే. అయితే జన్మతోనే అప్పులు ఎందుకు వస్తాయన్నది జిజ్ఞాసువుల ప్రశ్న.

పితృఋణం

ఋషులు చెప్పే పై మూడు ఋణాలలో మొదటిది పితృఋణం. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మనం ఋణపడి ఉంటాము. ఎట్లంటే – తల్లి మనను నవమాసాలు గర్భంలో మొయ్యటమే కాకుండా తన శరీరంలోని రక్తాన్ని పంచియిచ్చింది. తద్వారా ప్రోటీన్లను, క్రొవ్వులను, కార్బోహైడ్రేట్లను, జీవరసాయనాలను (Bio - Chemicsను), విటమిన్లను ఇచ్చి మన శరీరానికి ఉపాదాన కారణమయ్యింది – నిర్మాత్రి అయ్యింది. గర్భ సమయంలో ఎన్నో యిబ్బందులకు గురిఅయ్యింది. ఎన్నో జాగ్రత్తలు తీసుకుంది, పథ్యాలు చేసింది. మందులు వేసుకుంది. చాలా కష్టాన్ని సహించి కాన్పు జరిపి మనను భూమిపైకి

తీసుకువచ్చింది. మల మూత్రాదులను అసహ్యించుకోకుండా ఎన్నోరకాల సేవలు చేసింది. మనకు అన్నాదులు జీర్ణమయ్యేవరకు తన రక్తాన్ని పాలుగా మార్చి పోషించింది. నడక మాటలు స్నాన శౌచ వస్త్ర ధారణాదులు నేర్పింది. ఇలా వ్రాసుకుంటూపోతే పెద్ద పుస్తకమే అవుతుంది.

ప్రత్యక్షంగా కాకున్నా పరోక్షంగా తండ్రి చేసిన సేవలు కూడా చాలానే ఉంటాయి. ఆయన సంపాదించి ఆలనా పాలనా చూసుకోబట్టే అమ్మ నిశ్చింతగా మనకు సేవలు చెయ్యగలిగింది. తండ్రి మనను పోషించి చదివించి విద్యాబుద్ధులు, సభ్యతా సంస్కారాలు, సమాజంలో మెలగవలసిన తీరుతెన్నులు నేర్పారు. తన ఆస్తిపాస్తులకు వారసులను చేశారు. కనుక మాతాపితరుల ఋణం (పితృఋణం) మనకు పుట్టుకతోనే వస్తుంది. మన జ్ఞాన వికాసానికి వారే మొదటి కారణాలు. అందుచేతనే **"మాతృమాన్ పితృమాన్ ఆచార్యవాన్ పురుషో వేద"** అంటుంది శతపథ బ్రాహ్మణం (14-06-10). "మాతృదేవో భవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ" అంటుంది తైత్తరీయోపనిషత్ (శిక్షావల్లి - 11).

ఈ మొదటిదైన పితృఋణం తీరాలంటే వారు జీవించి ఉన్నపుడే వారికి సేవలు చేసి, వారితో ప్రియంగా వ్యవహరించి తీర్చుకోవాలి. వారు వృద్ధాప్యం వల్లగానీ, వ్యాధి వల్లగానీ, మరే కారణంతోనైనా గానీ అశక్తులైనపుడు వారికి అవసరమైన అన్నిరకాల సేవలు చెయ్యాలి. వారి మనస్సు నొప్పింపక ప్రేమతో వ్యవహరించాలి. వారికి మనం అనువ్రతులం కావాలి. అంటే - వారు చేసిన దాన ధర్మాది సత్కార్యాలను, పరోపకార అభయ దానాది వంశ మర్యాదలను మనం అనుసరించి చేస్తూ ఉండాలి. **"అనువ్రతః పితుః పుత్రః మాత్రా భవతు సంమనాః"** అంటుంది అథర్వవేదం (3-30-2).

మహాభారత యుద్ధం తరువాత మనదేశంలో కొన్ని అవైదిక పురాణాల కల్పన జరిగింది. కొందరు స్వార్థపరులు స్వప్రయోజనం కొరకు కొన్ని సాంప్రదాయాలను, ఆచారాలను పురాణాలుగా వ్రాసిపెట్టారు. అందులోనిదే మృతక శ్రాద్ధ తర్పణాది ఆచారం. వివరంగా తెలుసుకోగోరువారు మహర్షి దయానంద సరస్వతుల వారి జగత్ప్రసిద్ధ రచన "సత్యార్థ ప్రకాశం"లోని ఏకాదశ సముల్లాసం చదువగోరుచున్నాము. ఇక మనం రెండవ ఋణం గురించి తెలుసుకుందాము. రెండవది -

దేవఋణం

దేవతలు అంటే "దివ్యమైన పరోపకారాది దివ్యగునాలు కలిగినవా"రని అర్థం. ఆ దివ్యగుణాలు వ్యక్తులలో ఉంటే వారిని చేతన దేవతలనీ, పదార్థాలలో ఉంటే వాటిని జడ దేవతలనీ అంటారు. చేతనము అంటే జ్ఞానం కలది యనీ, జడము అంటే జ్ఞానం లేనిది అనీ అర్థం. ఈ రెండవ ఋణం జడదేవతల ఋణం. జడదేవతలలో ముందుగా లెక్కించ తగినవి పంచభూతాలు – భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశములు.

ఈ పంచభూతాల ఋణం మనకు జన్మతోనే వస్తుంది. ఎందుచేతనంటే – వాటితోనే మన శరీరాలు నిర్మించబడ్డాయి, పెరిగి పెద్దవైనాయి. వాటిలోనే, వాటి ఆధారంతోనే జీవిస్తున్నాయి. వీటిలో జ్ఞానం లేకపోయినా ఇవి సదా ప్రాణులకు మేలు చేస్తూనే ఉంటాయి. కనుక వీటిని జడ దేవతలన్నారు.

మన శరీరాల ద్వారా వెలువడే మల మూత్ర స్వేద నిశ్వాసాల ద్వారా ఈ పంచభూతాలు మలినమౌతూ ఉంటాయి. వాటిని శుద్ధిచేసే ఏర్పాట్లు సృష్టిలో ఉన్నా బుద్ధిజీవులమైన మనం కూడా కొంత ప్రయత్నం చెయ్యాలి అంటుంది వేదం. ప్రతీ వ్యక్తి ఉదయం సాయం సమయాలలో పరమేశ్వరుని స్తుతి ప్రార్థనోపాసనలతోపాటు దైనిక అగ్నిహోత్రం చెయ్యాలంటుంది యజుర్వేదం. ఇది పర్యావరణాన్ని పరిశుద్ధంచేసే ఒక వైజ్ఞానిక ప్రక్రియ. మామిడి, మోదుగ, రావి మొదలైన సమిధలతో అగ్నిని జ్వలింపచేసి దానిలో దేశీ ఆవునేతిని ఆహుతులుగా యివ్వాలి. దానితోబాటు ఆయా ఋతువులకు అనుకూలమైన మూలికలను, సుగంధ ద్రవ్యాలను ఆహుతులుగా యిస్తే చక్కటి ఫలితాలు కలుగుతాయి. గృహంలోని, పరిసరాలలోని వాయువు శుద్ధమౌతుంది. తద్వారా ఇంట్లోనివారికి చక్కటి ఆరోగ్యం, బలం, ఉత్సాహం, స్ఫూర్తి కలుగుతాయి. ఈవిధంగా దైనిక అగ్నిహోత్రం చేస్తూ దేవతల ఋణం తీర్చుకోవాలి.

ఋషిఋణం

ఋషిఋణం అంటే జ్ఞానఋణం. సృష్టికర్తయైన సర్వవ్యాపక సర్వేశ్వరుడు ఆదిమానవ సృష్టి సమయంలోనే యోగ్యులైన నలుగురు ఋషుల హృదయాలలో ఋగ్ యజుర్ సామ అథర్వ వేదాలను ప్రకాశపరచాడు. వారు వాటిని తోటి

సామాన్య మానవులకు నేర్పారు. ఆ మంత్రాలను అర్థం చేసుకోవటానికి కావలసిన వేదాంగాలను – శిక్షా కల్ప వ్యాకరణ నిరుక్త ఛందో జ్యోతిషాలను రూపొందించి శిష్యుల కుపదేశించారు. ఆనాటినుండి ఈనాటివరకు గురుశిష్య పరంపరగా వేదాలు, వేదాంగాలు వస్తున్నాయి. తదుపరి వచ్చిన ఋషులు వాటి ఆధారంతో పరిశోధనలు జరిపి ఉపవేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు మొదలైన అనేకానేక శాస్త్రాలు వ్రాశారు. వాటిని లోకంలో విస్తృతంగా ప్రచారం చేశారు. అందువల్ల అవి మనవరకు నిలిచి ఉన్నాయి. కనుక మనం కూడా మన శక్తికొలది కొన్ని శాస్త్రాలను అధ్యయనం చేసి, వాటికి మన అనుభవాన్ని జోడించి ముందుతరాలకు అందించే ప్రయత్నం చెయ్యాలి. అలా చేస్తేనే ఋషిఋణం తీరుతుందంటాయి శాస్త్రాలు.

స్వాధ్యాయేనార్చయేత్ ఋషీన్, హోమైర్ దేవాన్ యథావిధిః ।
పితౄన్ శ్రాద్ధైశ్చ నౄనన్నైర్భూతాని బలికర్మణా ॥

– మనుస్మృతి 3–57

అంటే – "ఋషులు వ్రాసిన గ్రంథాలను అధ్యయన అధ్యాపనలు చేస్తూ ఋషుల ఋణాన్నీ, యథావిధిగా హోమాలు చేస్తూ దేవ ఋణాన్నీ, జీవిత మాతా పితరులకు శ్రద్ధతో సేవలు చేస్తూ పితృఋణాన్నీ ఆశ్రిత ప్రాణులకు ఆహారం పెడుతూ బలివైశ్వదేవ యజ్ఞం చేయాలంటాయి తీర్చుకోవా" లంటాయి శాస్త్రాలు.

ఈ మూడు ఋణాలు మనకు జన్మతోనే వస్తాయని తెలపటానికే మూడు ప్రోగులు గల యజ్ఞోపవీతాన్ని ధరింపచేస్తారు మన పెద్దలు. అది సదా మన ఎడమ భుజంపైన ఉంటూ మనకు ఋణాలను గుర్తుచేస్తూ ఉంటుంది. విద్యా సదాచారాలు గల స్త్రీ పురుషులంతా ద్విజులేనంటాయి వేదశాస్త్రాలు. కనుక అట్టివారంతా యజ్ఞోపవీతం ధరించవచ్చు. యజ్ఞమయ జీవితం గడపవచ్చు. మీరు ఏ వయస్సులో ఉన్నవారైనా మీకు యజ్ఞోపవీత సంస్కారం చెయ్యటానికి ఆర్యసమాజం సదా సిద్ధంగా ఉంటుంది. స్వస్తి – మీకు మంచి అగునుగాక!